సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 15 । ఆగస్టు । 2023



శిశువుల వైద్యంపై అప్రమత్తం

నవజాత శిశువులకు వైద్య సేవలు అందించే విషయంలో సిబ్బంది ఎంతో అప్రమత్తంగా ఉండాలని భరత్ కుమార్ తెలిపారు. IIలో



పిల్లల బరువు పరిశీలించాలి

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎత్తు, బరువులను విధిగా పరిశీలించాలని స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆర్‌జేడీ ఆదేశించారు. IIలో



ఏళ్లనాటి కల.. నెరవేరిన వేళ

రెండు దశాబ్దాలుగా కరుగొండ గ్రామస్తులు ఎదురుచూస్తున్న రోడ్డు కల నెరవేరింది. కరుగొండ గ్రామానికి రోడ్డు మంజూరైంది. IIలో

న్యూస్‌రీల్

మరో ఐదు ఆధార్ సెంటర్ల ఏర్పాటు



ఆధార్ కిట్లు అందజేస్తున్న పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: కొత్తగా ఐదు ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే తెలిపారు. ఈ ఐదుసెంటర్లకు సంబంధించిన కిట్లను సెంటర్ల నిర్వాహకులకు రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి పీవో సోమవారం అందజేశారు. ఐటీడీఏ సమావేశం హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో పీవో మాట్లాడుతూ ఇప్పటికే రంపచోడవరం, చింతూరు డివిజన్లలోని 11 మండలాల్లోని 11 ఆధార్ సెంటర్లు ఉన్నాయని చెప్పారు. అదనంగా మరో ఐదు సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరగా గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ మంజూరు చేసినట్టు చెప్పారు. దీంతో ఆధార్ సెంటర్ల సంఖ్య 16కు పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కె.కోటేశ్వరరావు, రీజినల్ ఆధార్ సెంటర్ కోఆర్డినేటర్ వి.డేవిడ్ కమలాకర్, డివిజనల్ కోఆర్డినేటర్ బి.డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

రంపచోడవరం సబ్‌కలెక్టర్‌కు వినతి



శుభం భన్సాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ కుంజం మురళి

దేవీపట్నం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పోలవరం నిర్వాసితులు రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం భన్సాల్‌కు వినతిపత్రం అందజేశారు. రంపచోడవరం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎంపీపీ కుంజం మురళీ ఆధ్వర్యంలో దేవీపట్నం మండలంలో ఫేజ్1 గ్రామాలైన అంగుళూరు, పి.గొందూరు, పరగసానిపాడు, డి.రావిలంక, బోడిగూడెం, నేలకోట, వీరవరంలంక, గండికోటలకు చెందిన నిర్వాసితులు వినతిపత్రం అందజేశారు. తమకు ప్యాకేజీ ప్రయోజనాలకు అర్హత కల్పించాలని, సీఎం వై.ఎస్.జగన్‌మోహనరెడ్డి నిర్వాసితులకు ప్రకటించిన ఆర్అండ్ ఆర్ అదనపు ప్యాకేజీని తమ గ్రామాలకు కూడా వర్తింపచేయాలని, తమ గ్రామాలకు చెందిన కటాఫ్ డేట్ ఆధారంగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ప్యాకేజీ సొమ్ము అందించాలని కోరారు. డి.రావిలంక గ్రామానికి చెందిన గిరిజన రైతులకు భూమికి భూమి పరిహారంగా ఇచ్చిన భూముల్లో వేరే రైతులు సాగులో ఉన్నారని.. ఈ సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ విషయం పై సబ్‌కలెక్టర్ స్పందిస్తూ నిర్వాసితులకు అందించిన భూముల్లో వివాదం లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కలుం శ్రీనివాస్ దొర తదితరులు పాల్గొన్నారు.

ఏలేరు వాగులో పడి వ్యక్తి మృతి



ఏలేరు వాగులో పడి మృతి చెందిన సంపతి చిట్టిబాబు

అడ్డతీగల: మండలంలోని ఎల్లవరం వద్ద ఏలేరు వాగులో ప్రమాదవశాత్తు పడి ఎల్లవరం గ్రామానికి చెందిన సంపతి చిట్టిబాబు(30) అనే వ్యక్తి సోమవారం మృతి చెందాడు. వీఆర్వో మురళీకృష్ణ,మృతుని బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉదయం చేపలు పట్టేందుకు వెళ్లిన చిట్టిబాబు కాలుజారి వాగులో పడి మరణించాడు. ఈ మేరకు అడ్డతీగల పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు వీఆర్వో మురళీకృష్ణ చెప్పారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

త్రివర్ణ శోభితం

- పాడేరులో భారీ జాతీయ జెండాతో ర్యాలీ
- అమరవీరుల త్యాగాల ఫలితమే స్వాతంత్య్రం : ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



300అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ



పాడేరు పాతబస్టాండ్ అంబేడ్కర్ సెంటర్‌లో జాతీయ జెండా ప్రదర్శన

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రం పాడేరు వీధులు త్రివర్ణ శోభితమయ్యాయి. ఆజాదీకా అమృత మహోత్సవం ,హర్ ఘర్ తిరంగాలో భాగంగా సోమవారం భారీ జాతీయ జెండాతో విద్యార్థులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. భారత్‌మాతాకి జై అంటూ చేసిన నినాదాలతో ప్రతి మది దేశభక్తితో ఉప్పొంగింది. ముచ్చటైన మూడు రంగులు, అశోక చక్రంతో ప్రజ్వరిల్లినట్టు ఉన్న జాతీయపతాకాన్ని తిలకించిన స్థానికుల గుండెలు ఉప్పొంగాయి. ర్యాలీని స్థానిక తలారిసింగి ఆశ్రమ పాఠశాల మైదానంలో కలెక్టర్ సుమిత్‌కుమార్,ఐటీడీఏ పీవో అభిషేక్,అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణలు ప్రారంభించారు. తలారిసింగి మైదానం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌రోడ్డు,సినిమాహాల్ సెంటర్ మీదుగా పాతబస్టాండ్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సెంటర్ వరకు 300 మీటర్ల జాతీయ జెండాతో నిర్వహించిన ర్యాలీ అందర్నీ విశేషంగా ఆకట్టుకుంది.అనంతరం పాతబస్టాండ్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ఎందరో స్వాతంత్య్ర సమరయోధులు,అమరవీరుల త్యాగాల ఫలితంగానే నేడు మనమంతా స్వాతంత్య్ర ఫలాలు పొందుతున్నామని తెలిపారు. విద్యార్థి దశ నుంచే దేశసేవ లక్ష్యాన్ని కూడా నిర్మించుకోవాలన్నారు.గిరిజన ప్రాంతాల అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. అల్లూరి సీతారామరాజు,వీరయ్యదొర,మల్లుదొర, గంటందొర,మఱ్ఱి కామయ్యల పోరాటాల చరిత్రను గుర్తుంచుకోవాలని,వారిని గిరిజన ప్రాంత ప్రజలు నిత్యం స్మరించుకోవాలని ఎమ్మెల్యే కోరారు.ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ ఎందరో మహానుభావులు జీవితాలను త్యాగం చేసి దేశానికి స్వాతంత్య్రం తెచ్చారన్నారు.అల్లూరి సీతారామరాజు 27ఏళ్లు జీవిస్తే,ఆయన కీర్తి మాత్రం వందల ఏళ్ల చరిత్రలో నిలుస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకరరావు,వెంకటేశ్వరరావు,గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు,ఐటీడీఏ ఏవో హేమలత,ఏఏవో శ్రీనివాసకుమార్,ఏటీడబ్ల్యువో ఎల్.రజనీ, హెచ్ఎంలు రీమలి జాన్,ప్రసాద్, ఉపాధ్యాయులు,అధిక సంఖ్యలో విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

హుకుంపేటలో..

హుకుంపేట: స్థానిక ప్రభుత్వ పాఠశాల నుంచి మోదకొండమ్మ తల్లి ఆలయం వరకు పలువురు విద్యార్థులు 75 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అల్లూరి సీతారామరాజు, మఱ్ఱి కామయ్యల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు, గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కురుస ఉమామహేశ్వరరావు, స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలం నాయుడు,బీజేపీ నాయకులు వంతాల గాసన్న, పాంగి మత్స్యకొండబాబు, గోపాల పాత్రుడు,వేమన్న,చిన్నయ్య,సత్యవతి, సుధకార్ తదితరులు పాల్గొన్నారు.

పెదబయలులో..

పెదబయలు: నా మట్టి..నాదేశం కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం నుంచి ప్రధాన రహదారి మీదుగా జాతీయ పతాకంతో భారీ ర్యాలీ నిర్వహించారు.భారత్ మాతాకి జై, స్వాతంత్య్ర పోరాట సమరయోధులకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. అంబేడ్కర్ కూడలిలో మానవహారం నిర్వహించారు. ఆశ్రమ పాఠశాల హెచ్ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటింటా ఎగరాలి జెండా



అధికారులకు జాతీయ జెండాలను అందజేస్తున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్

పాడేరు రూరల్ : ఐటీడీఏ పరిధిలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు, ఉద్యోగులకు సోమవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజాదీ కా అమృత్ మహోత్సవ్, హర్‌ఘర్ తిరంగాలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఇంటింటా జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని, సమైఖ్యతను చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు వి.ఎస్.ప్రభాకర్‌రావు, ఎం.వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు, ఈఈ డి.వి.ఆర్.ఎం. రాజు, పంచాయతీరాజ్ ఈఈ కొండయ్య పడాల్, ఐటీడీఏ ఏవో హేమలత, సీహెచ్‌వో అశోక్, ఐటీడీఏ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



పెదబయలులో జాతీయ పతాకంతో విద్యార్థుల ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పీవో అభిషేక్,అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



హుకుంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పంద్రాగస్టుకు భారీగా ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్



తలారిసింగి మైదానంలో ఏర్పాటు చేసిన గుడారాలు

వేడుకల్లో పాల్గోనున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రం పాడేరులోని తలారిసింగి ఆశ్రమ పాఠశాల మైదానంలో మంగళవారం నిర్వహించే స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమాలకు భారీ ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు,ఐటీశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతకాన్ని ఆవిష్కరించనున్నట్టు చెప్పారు. ఉదయం 9గంటలకు జాతీయ పతకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరిస్తారని తెలిపారు. అనంతరం స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబ సభ్యులకు సత్కరిస్తారని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన అనంతరం జిల్లా ప్రగతికి సంబంధించి అన్ని ప్రభుత్వశాఖల శకటాల ప్రదర్శన ఉంటుందన్నారు. మంత్రి అమర్‌నాథ్ ప్రభుత్వ పథకాల స్టాళ్లను కూడా పరిశీలిస్తారని, వివిధ శాఖలలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు,ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ ఏడాది కూడా స్వాతంత్య్ర దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహిస్తామని కలెక్టర్ చెప్పారు.

ఏర్పాట్లు పరిశీలించిన ఐటీడీఏ పీవో

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో తలారిసింగి మైదానంలోని ఏర్పాట్లను ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సోమవారం పరిశీలించారు. పాఠశాల మైదానాన్ని ముస్తాబు చేయడంతో పాటు అన్ని ఏర్పాట్లలో గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ విభాగం అధికారులు నిమగ్నమయ్యారు. గిరిజన సంక్షేమ ఈఈ డి.వి.ఆర్.ఎం.రాజు,డీఈఈ అనుదీప్,ఏటీడబ్ల్యూవో ఎల్.రజనీలతో పీవో సమీక్షించారు.ఏర్పాట్లన్నీ ఘనంగా ఉండాలని అధికారులకు సూచించారు.

ఒక సర్పంచ్, 44 వార్డు స్థానాలు ఏకగ్రీవం

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

సాక్షి,పాడేరు: జిల్లాలో ఒక సర్పంచ్, 44 వార్డు స్థానాలు ఏకగ్రీమయ్యాయి. నాలుగు సర్పంచ్, 58 వార్డులకు ఈనెల 19న ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారంతో ముగిసింది. రంపచోడవరం మండలం ఆకూరు పంచాయతీ స్థానానికి సంబంధించి రెండు నామినేషన్లు దాఖలు కాగా,ఒకరు విత్‌డ్రా అవడంతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు కట్టుల సరస్వతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు అధికారులు తెలిపారు. పాడేరు డివిజన్ పరిధిలోని జీకే వీధి మండలం సీలేరు పంచాయతీ సర్పంచ్ స్థానానికి ముగ్గురు, పెదబయలు మండలం పెదకోడాపల్లి సర్పంచ్ స్థానానికి ఐదుగురు,హుకుంపేట మండలం శోభకోట సర్పంచ్ స్థానానికి నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో ఎవరూ నామినేషన్లు ఉపసంహరించుకోక పోవడంతో పై మూడు పంచాయతీ స్థానాలకు 12మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని డీఎల్‌పీవో పి.ఎస్.కుమార్ తెలిపారు.

14 వార్డుల్లో పోటీ

జిల్లాలోని 58 వార్డు స్థానాలకు సంబంధించి నామినేషన్లు ఇటీవల అధికారులు స్వీకరించగా, చాలా స్థానాల్లో అభ్యర్థులు విత్‌డ్రా అవడంతో 44 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 14 వార్డు స్థానాలకు మాత్రం పోటీ నెలకొంది. చింతపల్లి పంచాయతీలోని 4వార్డు, కుడుముసారి పంచాయతీలోని 9వవార్డు, కొయ్యూరు మండలంలోని రేవళ్లలో 5వవార్డు, పి.మాకవరంలో 1వవార్డు, హుకుంపేట మండలంలోని బారామోసిలో 3వవార్డు, పెదబయలు మండలం ఇంజరి పంచాయతీలోని 4,12వ వార్డులు,చింతూరు మండలంలోని తుమ్మలలో 6వ వార్డు,కొత్తపల్లిలో 1వ వార్డు, గూడురులో 5వ వార్డు,కూనవరం మండలం వెంకటయ్యపాలెంలో 3వ వార్డు, రంపచోడవరం మండలంలోని బండపల్లిలో 8వ వార్డు,దేవిపట్నం మండలంలోని డి.ఎస్.పాలెంలో 6వ వార్డు,దేవిపట్నంలో 2వవార్డుకు ఎన్నికలు జరగనున్నాయి.మొత్తం 14వార్డు స్థానాలకు గాను 30మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.సోమవారం నామినేషన్లు విత్‌డ్రా అనంతరం ఏకగ్రీవమైన ఆకూరు పంచాయతీ సర్పంచ్ కట్టుల సరస్వతితో పాటు, పలు పంచాయతీల పరిధిలో 44వార్డుల సభ్యులకు ఆయా ఎన్నికల అధికారులు ఎన్నిక పత్రాలను అందజేశారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన ఆకూరు సర్పంచ్‌కు పత్రాన్ని అందజేస్తున్న అధికారి

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

- కలెక్టర్ భేటీలో సింగపూర్ రెడ్‌క్రాస్ సభ్యుల వెల్లడి



కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో సింగపూర్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు

సాక్షి,పాడేరు: మారుమూల గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని సింగపూర్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు తెలిపారు. సింగపూర్ దేశానికి చెందిన రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు సత్యనారాయణ,డానియేల్,పుండ్రీలు జిల్లాలోని రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులతో కలిసి రెండు రోజుల పాటు మన్యంలో పర్యటించారు. పెదబయలు,హుకుంపేట, పాడేరు మండలాల్లోని పలు మారుమూల గ్రామాల్లో ఈ బృందం పర్యటించింది. గిరిజనుల జీవన విధానం,వైద్య ఆరోగ్య కార్యక్రమాలపైన ఈబృందం సమీక్షించింది.సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను వారంతా కలిశారు.తాము పర్యటించిన గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పిస్తామని, వచ్చే నవంబర్‌లో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సింగపూర్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులతో పాటు స్థానిక ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు.ఈకార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ఉమ్మడి విశాఖ జిల్లా చైర్మన్ డాక్టర్ వై.శివనాగేంద్రరెడ్డి, అనకాపల్లి,పాడేరుశాఖల సమన్వయకర్తలు కోటేశ్వరరావు,లోహితాస్,సభ్యులు సూర్యారావు,జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అరకు రైల్వేస్టేషన్ తనిఖీ చేసిన డీఆర్‌ఎం

రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులపై సమీక్ష

అరకులోయ: డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్‌ఎం) సౌరబ్ ప్రసాద్ సోమవారం అరకు(యండపల్లివలస)రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేశారు. రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలపై ఆయన సమీక్షించారు. కేటరింగ్ స్టాల్స్,రెస్ట్ హౌస్, వెయిటింగ్ హాళ్లు,డార్మెటరీలను డీఆర్‌ఎం తనిఖీ చేశారు. రైల్వేస్టేషన్ పరిధిలోని అధికారులు,ప్రయాణికులతోను ఆయన మాట్లాడారు. ప్రయాణికుల నుంచి సలహాలు,సూచనలు స్వీకరించారు.అనంతరం యార్డు, రైల్వే ట్రాక్ ప్రాంతాలను డీఆర్‌ఎం పరిశీలించారు. రైల్వే స్టేషన్ పరిధిలోని అందుబాటులోకి వచ్చిన అదనపు ట్రాక్‌లు,క్రాసింగ్ పాయింట్‌లలో సిగ్నలింగ్ వ్యవస్థను ఆయన తనిఖీ చేశారు. కొత్తవలస-కిరండోల్ రైల్వేలైన్‌లోని జరుగుతున్న 2వ ట్రాక్ పనులు, పలు ప్రాంతాల్లో బ్రిడ్జిల నిర్మాణాలతోపాటు భద్రత చర్యలపైన ఇంజినీరింగ్, ఇతర విభాగాల అధికారులతో డీఆర్‌ఎం సమీక్షించారు.ఈ కార్యక్రమంలో కన్‌స్ట్రక్షన్ విభాగం చీఫ్ ఇంజినీర్ కె.ధనుంజయరావు,సీనియర్ డివిజనల్ ఇంజినీర్ ఎ.కె.మోహన్,సీనియర్ డివిజనల్ సిగ్నల్ అండ్ టెలికం ఇంజినీర్ శర్మ, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ ప్రభాత్‌సింగ్,సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ శివానంద ప్రసాద్,సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి,అరకు స్టేషన్ అధికారులు,భద్రత విభాగం అధికారులు పాల్గొన్నారు.



అరకు రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్,ఇతర అధికారులు



ట్రాక్ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్

ఉత్తమ సేవకుడీ అశోకుడు

విధి నిర్వహణే ధ్యేయంగా సాగుతున్న ఆయనను పురస్కారాలు వరిస్తున్నాయి. ఓ వైపు అంతర్‌రాష్ట్ర ముఠాలను పట్టుకోవడంతో పాటు గిరిజనులకు విశేషంగా అందించిన సేవలకు మరో సారి గుర్తింపు లభించింది. ఇప్పటి వరకు నాలుగు అవార్డులు అందుకున్న స్థానిక సీఐ అశోక్‌కుమార్ తాజాగా కేంద్ర హోమ్ శాఖ ఇచ్చే ప్రెసిండెంట్ మెడల్‌కు ఎంపికయ్యారు.

- ప్రెసిడెంట్ మెడల్‌కు సీఐ అశోక్ కుమార్ ఎంపిక
- జాతీయ స్థాయిలో గుర్తింపు

గూడెంకొత్తవీధి: విధి నిర్వహణలో ఎంత కఠినంగా, బాధ్యతగా ఉంటారో... గిరిజనులకు మేలు చేసే కార్యక్రమాల్లోనూ అంతే చురుగ్గా, చిత్తశుద్ధితో వ్యవహరిస్తారు అశోక్‌కుమార్. 2009 బ్యాచ్‌కు చెందిన అశోక్ కుమార్‌కు తొలి పోస్టింగ్ మావోయిస్టు ప్రాబల్య ప్రాంతమైన చింతపల్లి మండలం అన్నవరంలో లభించింది. అక్కడ ఎస్ఐగా చేరారు. అక్కడ గిరిజనులతో మమేకమై ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అక్కడ నుంచి కొత్తకోట, విశాఖ అర్బన్, సిటీ,నర్సీపట్నం, నాతవరం, అనకాపల్లి దిశా పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారు. మావోయిస్టుల కంచుకోటగా గుర్తింపు పొందిన గూడెంకొత్తవీధికి పదోన్నతిపై సీఐగా 2021 బదిలీ అయ్యారు.



గౌతమ్ సవాంగ్ నుంచి అవార్డు అందుకుంటున్న అశోక్‌కుమార్



అప్పటి విశాఖ జిల్లా కలెక్టర్ వినయ్‌కుమార్ చంద్ నుంచి అవార్డు అందుకుంటున్న సీఐ

నేరగాళ్ల గుండెల్లో గుబులు పుట్టించి

- గూడెంకొత్తవీధి మీదుగా ఒడిశా, తెలంగాణ ప్రాంతాలకు వెళ్లే ధారకొండ ఘాట్ రోడ్డులో దారి దోపిడీలకు పాల్పడుతూ ప్రయాణికులను బెంబేలెత్తించిన ఒడిశా ముఠా సభ్యులను వలపన్ని పట్టుకోవడంలో సీఐ చురుకైన పాత్ర పోషించారు. 2021లో ఐదు సంఘటనలకు సంబంధించి 8 మందిని పట్టుకుని, వారి వద్ద నుంచి 3 తుపాకులు, నగదు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దీంతో దారి దోపిడీలకు తెరపడడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.
- మహారాష్ట్ర గంజాయి ముఠా చెరలో 9 నెలలు బందీలుగా ఉన్న ఆరుగురు గిరిజనులను సురక్షితంగా తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. ఏబులం ప్రాంతానికి చెందిన పాంగి గోవర్ధన్, ధనలక్ష్మి, తరుణ్, యశోధ, గెమ్మెలి నాగేంద్రబాబు, పాంగి కేశవ్‌లను క్షేమంగా తీసుకువచ్చి, ముఠాకు చెందిన ముగ్గురిని కటకటాల వెనక్కి పంపించడంలో సీఐ ప్రధాన పాత్ర పోషించారు.
- గంజాయి సాగు నివారణలో ఆయన ముఖ్య భూమిక పోషించారు. ఏజెన్సీ మొత్తం 1400 ఎకరాల్లో తోటలు ధ్వంసం చేయగా ఒక్క జీకేవీధి మండలంలోనే 700 ఎకరాల్లో సాగు నివారించి, అక్రమ రవాణాకు అడ్డుకట్టు వేశారు.

సేవలకు గుర్తింపు

- దారిదోపిడీ ముఠాను 2021లో చాకచక్యంగా పట్టుకున్నందుకుగాను అప్పటి డీజీపీ గౌతమ్ సవాంగ్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.
- మహారాష్ట్ర గంజాయి ముఠా వద్ద బందీలుగా ఉన్న గిరిజనులను సురక్షితంగా విడిపించినందుకు అప్పటి అల్లూరి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ప్రశంసించి అవార్డు అందజేశారు. తాజాగా కేంద్ర హోమ్‌శాఖ ఇచ్చే దేశ అత్యున్నత ప్రెసిడెంట్ మెడల్‌కు ఎంపికయ్యారు. ఈ నెల 26న ఢిల్లీలో అందుకోనున్నారు. దేశవ్యాప్తంగా 140 మంది ఈ అవార్డులకు ఎంపిక కాగా ఉమ్మడి విశాఖపట్నం రీజియన్ పరిధిలో ఈయన మాత్రమే ఎంపిక కావడం విశేషం. గతంలో అప్పటి కలెక్టర్ వినయ్ కుమార్ చంద్ ఉత్తమ సీఐగా , ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నుంచి అవార్డులు అందుకున్నారు.

సంతోషంగా ఉంది



చిత్తశుద్ధితో పనిచేసినందుకు తగిన గుర్తింపు లభించింది. దారి దోపిడీ ముఠాను పట్టుకోవడం, మహారాష్ట్రలో గంజాయి స్మగర్ల చెరలో బందీలుగా ఉన్నగిరిజనులను సురక్షితంగా విడిపించిన సంఘటనలు ఎప్పటికీ మరిచిపోలేను. ప్రెసిడెంట్ మెడల్ రావడం సంతోషంగా ఉంది.

– అశోక్‌కుమార్, సీఐ, జీకే వీధి

21లోగా ఓటరు సర్వేను పూర్తి చేయాలి



జి.మాడుగులలో బీఎల్‌వోల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శివ శ్రీనివాస్

జి.మాడుగుల: ఈ నెల 21లోగా ఇంటింటి ఓటరు సర్వేను పూర్తి చేయాలని జేసీ శివ శ్రీనివాస్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం బీఎల్‌వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వేను పారదర్శకంగా పక్కా నిర్వహించాలని చెప్పారు. 18సంవత్సరాలు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. మృతి చెందిన, గ్రామాల నుంచి వలస వెళ్లిపోయిన వారి పేర్లను జాబితాల నుంచి తొలగించాలని జేసీ ఆదేశించారు. బీఎల్‌వోలకు ప్రజాప్రతినిధులు సహకరించాలని జేసీ కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మార్షల్ ఆర్ట్స్‌లో గిరిజన విద్యార్థుల ప్రతిభ



విజేతలతో ఉపాధ్యాయులు

అరకులోయటౌన్: శ్రీకాకుళంలోని అంబేడ్కర్ భవన్‌లో ఈనెల 13న జరిగిన రాష్ట్ర స్థాయి ఐదో స్కై మార్షల్ ఆర్ట్స్‌లో అరకులోయ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు కోచ్, మ్ మేనేజర్‌లు తాంగుల బాలకృష్ణ, పాంగి రాంబాబు తెలిపారు. వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఎస్.దేదివ్య 35 కిలోల విభాగం, పి.రేష్మశ్రీ 34 కిలోలు, కె.చంద్రశేఖర్ 36 కిలోలు, ఎస్.హర్షవర్ధన్ 26 కిలోల విభాగంలో పాల్గొని, అందరూ ద్వితీయ స్థానంలో నిలిచినట్టు చెప్పారు. విద్యార్థుల విజయం పట్ల హెచ్‌ఎం. తాంగుల మోహన్‌రావు, ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి పాంగి సూరిబాబు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

మత్స్యగెడ్డలో పడి మహిళ మృతి

పెదబయలు: చుట్టుమెట్ట గ్రామానికి చెందిన మహిళ ఒడిశా రాష్ట్రం పాత్లోంగి పంచాయతీ పాములపుట్టు గ్రామ సమీపంలో మత్స్యగెడ్డలో పడి మృతి చెందిందని ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. అరడకోట పంచాయతీ చుట్టుమెట్ట గ్రామానికి చెందిన పాంగి సీతమ్మ(55)ఈ నెల 11న గ్రామం నుంచి సారా కోసం ఒడిశా రాష్ట్రం వేలంబొడ్డ గ్రామానికి వెళ్లి తిరుగుప్రయాణంలో కనిపించకుండా పోయిందని చెప్పారు. బంధువుల ఊరికి వెళ్లిఉంటుందని కుటుంబ సభ్యులు భావించారు. సోమవారం ఒడిశా ప్రాంతం మత్స్యగెడ్డలో ఆమె శవమై తేలిందని ఎస్ఐ తెలిపారు. గెడ్డ దాటే క్రమంలో లోతు ఎక్కువగా ఉండడంతో ప్రవాహంలో కొట్టుకుపోయి ఉంటుందని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు.

ఏళ్లనాటి కల.. నెరవేరిన వేళ

- కరుగొండకు తారురోడ్డు నిర్మాణం
- రూ.1.77 కోట్లతో రహదారి
- రోడ్డు నిర్మాణానికి అరకు ఎమ్మెల్యే పాల్గుణ ప్రత్యేక చొరవ
- గ్రామస్తుల ఆనందం



కరుగొండ గ్రామంలో తారురోడ్డు

పెదబయలు: రెండు దశాబ్దాలుగా కరుగొండ గ్రామస్తులు ఎదురుచూస్తున్న రోడ్డు కల నెరవేరింది. అధ్వాన దారితో 2 ఏళ్ల తరబడి నానా అవస్థలు పడ్డారు. టీడీపీ హయాంలో పలుమార్లు ప్రజాప్రతినిధులు, నాయకులకు గ్రామస్తులు రోడ్డు కోసం వినతులిచ్చినా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మన్యంలో శివారు ప్రాంతాల్లోనూ రహదారుల పనులు చేపట్టారు. ఇందులో భాగంగా కరుగొండ గ్రామానికి రోడ్డు మంజూరైంది. ఎమ్మెల్యే పాల్గుణ ప్రత్యేక చొరవతో తమ గ్రామానికి రహదారి బాగుపడిందని స్థానికులు చెబుతున్నారు.

తీరిన కష్టాలు

మండలంలోని గోమంగి పంచాయతీ కరుగొండ గ్రామానికి తారురోడ్డు నిర్మాణంతో పంచాయతీ గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. మండలంలోని పోయిపల్లి పంచాయతీ అర్లాబు ఘాట్ నుంచి కరుగొండ గ్రామ చివరి వరకు రూ.1.77 కోట్లతో 3.03 కిలోమీటర్ల రోడ్డు పనులు చేపట్టారు. అర్లాబు ఘాటీ నుంచి కరుగొండ గ్రామం వరకు గ్రావెల్ రోడ్డు 2002 సంవత్సరంలో రోడ్డు నిర్మించారు. అప్పట్లో అస్తవ్యస్తంగా పనులు నిలిపివేశారు. అధ్వాన రహదారితో రెండు దశాబ్దాలుగా నానా అవస్థలు పడ్డామని, ఎట్టకేలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాకు తారురోడ్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. ముఖ్యమంత్రి జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామని చెబుతున్నారు. రోడ్డు కోసం ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే పాల్గుణకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

ఆనందంగా ఉంది



అర్లాబు ఆర్‌అండ్‌బీ ఘాటీ తారురోడ్డు కోసం ఎదురుచూశాం. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ గ్రామానికి వచ్చినపుడు తారురోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆయన ఇచ్చిన మాటకు అనుగుణంగా రోడ్డు మంజూరు చేశారు. రోడ్డు కష్టాలు తీరింది. ఆనందంగా ఉంది. అన్ని గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది.

– పాంగి సింహాచలం, మాజీ సర్పంచ్ గోమంగి పంచాయతీ

రెండు రోడ్ల నిర్మాణం



మండలంలో కరుగొండ రోడ్డు నిర్మాణం జరుగుతుంది. వర్షాలు కారణంగా కొంత జాప్యం జరిగింది. లేకుంటే రెండు వారాల ముందుగానే నిర్మాణం జరిగి ఉండేది. అరడకోట పంచాయతీ చుట్టుమెట్ట గ్రామంలో రూ.1.27 కోట్లతో కరుగొండ రోడ్డు పనులు ప్రారంభిస్తాం. త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– టి. శంకర్‌రావు, ఏఈ, పంచాయతీ రాజ్ ప్రాజెక్టు, పాడేరు

పిల్లల ఎత్తు, బరువులను విధిగా పరిశీలించాలి

మహిళా స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి

గూడెంకొత్తవీధి: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎత్తు, బరువులను ప్రతి నెలా విధిగా పరిశీలించాలని మహిళా స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆర్‌జేడీ ఎం.చిన్మయిదేవి ఆదేశించారు. దీనిపై ఎవరూ నిర్లక్ష్యం చేయరాదన్నారు. మండలకేంద్రంలో అంగన్‌వాడీ వర్కర్లతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

బాలింతలు, గర్భిణులకు విధిగా టేక్‌హోం రేషన్ అందజేయాలన్నారు. ఎంత మారుమూల ప్రాంతాలైనా సరకులను తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. సీజనల్ వ్యాధులపై అందరికీ అవగాహన కల్పించాలని తెలిపారు. బాలింతలు,గర్భిణులకు ఐరన్ మాత్రలు ఇచ్చి రక్తహీనతను నివారించాలని సూచించారు. ఇంతకు ముందు ఆమె కొత్తగూడెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సీడీపీవో లక్ష్మీదేవి, సూపర్‌వైజర్లు వలసమ్మ, మోహిని, లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థినిపై కుక్ దౌర్జన్యం

దేవీపట్నం: శరభవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినిని కుక్ చెప్పుతో కొట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వసతిగృహంలో ఎనిమిదవ తరగతి చదువుతున్న అలేఖ్య అనే విద్యార్థినికి చెందిన కళ్లజోడు బాక్స్ శనివారం సాయంత్రం కనిపించకుండాపోయింది. ఆదివారం ఉదయం కిచెన్‌లో ఉన్న పెట్టెలో కళ్లజోడు బాక్స్‌ను గమనించిన అలేఖ్య కమాటీ నరసరావును నిలదీసింది. బాక్స్‌లో డబ్బులు ఉన్నాయని, ఇది ఇక్కడికి ఎలా వచ్చిందని ప్రశ్నించింది. ఈ సమయంలో పక్కనే ఉన్న కుక్ రమణమ్మ దుర్భాషలాడుతూ మిగతా విద్యార్థినులు చూస్తుండగానే అలేఖ్యను చెప్పుతో రెండు చెంపలపై కొట్టింది. అక్కడున్న విద్యార్థినులు వారించినప్పటికీ నాకు అడ్డం వస్తే వేడినీళ్లు మీద పోస్తానని బెదిరించింది. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు సోమవారం పాఠశాలకు వచ్చి జరిగిన సంఘటన పై నిలదీసి, ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు వచ్చి నిలదీసేంతవరకూ సిబ్బందికి గాని ఉన్నతాధికారులకు గాని ఈ విషయం తెలియలేదు. కుక్ రమణమ్మ తమపై తరచూ కేకలు వేస్తూ దురుసుగా ప్రవర్తిస్తోందని విద్యార్థినులు తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఏటీడబ్ల్యూవో రామతులసి తెలిపారు.

వెల్ఫేర్ సొసైటీ ఏజెంట్‌పై ఫిర్యాదు



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న రామారావు, తదితరులు

అరకులోయటౌన్: మండల కేంద్రంలోని వెల్ఫేర్ సొసైటీ ఏజెంట్‌పై అరకులోయ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు సీపీఎం మండల కార్యదర్శి రామారావు తెలిపారు. సోమవారం బాధితులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఏజెంట్ మీసాల రాజు ప్రతీనెల రూ.500 చెల్లిస్తే మూడేళ్లలో 50 శాతం వడ్డీతో చెల్లిస్తామని నమ్మించి మోసగించారన్నారు. బాండ్ పేపర్లు తీసుకొని నెలలు గడుస్తున్నా సొమ్ము చెల్లించడం లేదన్నారు. దీంతో మీసాల రాజుతో పాటు యాజమన్యంపై ఫిర్యాదు చేశామన్నారు. బాధితులు మోద్నో, సద్దు, దశరద్, భీమ, రామ్‌దేవ్, సిపిఎం నాయకులు గొన్నో, రమేష్ ఉన్నారు.

నవజాత శిశువుల వైద్యం పట్ల అప్రమత్తం

ఎస్ఎన్‌సీయూ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్

కూనవరం: నవజాత శిశువులకు వైద్య సేవలు అందించే విషయంలో సిబ్బంది ఎంతో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఎన్‌సీయూ రాష్ట్ర ప్రోగ్రాంమేనేజర్ భరత్ కుమార్ తెలిపారు. మండల పరిధిలోని కోతులగుట్ట సీహెచ్‌సీలో ఎస్ఎన్‌సీయూ విభాగాన్ని సోమవారం ఆయన సందర్శించి నవజాత శిశువులకు అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. నవజాత శిశువులకు వైద్యసేవలు ఎలా అందుతున్నాయని బాలింతలను అడిగి తెలుసుకున్నారు. మందులు అందుబాటులో ఉన్నాయా, లేవా అని సిబ్బందిని అడిగారు. ఈసందర్భంగా ఆయన మట్లాడుతూ అత్యవసర వైద్యం అందించేలా జిల్లా ఆస్పత్రిలో ఫెసిలిటీ బేస్డ్ న్యూ బోర్న్ కేర్ ట్రైనింగ్ ద్వారా సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. డ్యూటీ అనంతరం పిల్లల వైద్యుడు టెలిఫోన్‌లో అందుబాటులో ఉంటారని వారి సూచనల మేరకు సిబ్బంది వైద్య సేవలు అందించాలన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.వి. కోటిరెడ్డి, పిల్లల వైద్య నిపుణులు వంశీ కృష్ణ, సీహెచ్‌సీ వైద్యుల సూచనల ప్రకారం సిబ్బంది నడుచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సిబ్బంది సైని, మేనేజర్ అమీర్, జాఫర్, నవీన్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల స్మరణ అందరి బాధ్యత



సూకురులో నా మట్టి.. నా దేశం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ,చిత్రంలో డిప్యూటీ కమిషనర్ మల్లికార్జునరావు



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, చిత్రంలో డిప్యూటీ కమిషనర్ మల్లికార్జునరావు

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: మహనీయుల త్యాగం వల్లే దేశానికి స్వాతంత్య్రం వచ్చిందని, మహనీయులను స్మరించుకుంటూ జన్మనిచ్చిన నేల తల్లిని స్వేచ్ఛగా జీవించేందుకు అవకాశం కల్పించిన దేశాన్ని గౌరవించుకునేలా చేపట్టిన నామట్టి-నా దేశం కార్యక్రమం మహోన్నతమైనదని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని సూకురులో సోమవారం ఆయన పర్యటించి,స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నా మట్టి నాదేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. నేలతల్లికి నమస్కారం-మహనీయులకు వందనం కార్యక్రమం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్రం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకోవడమే ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ డెవలప్‌మెంట్ ఎన్ఆర్ఈజీఎస్ వింగ్ డిప్యూటీ కమిషనర్ మల్లికార్జునరావు,ఎంపీపీ కూడా రాజుబాబు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు ఒంటుబు సామ్యేల్,ఎంపీడీవో వెంకటరావు,ఏపీవో లింగమూర్తి,మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు,జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు,మార్కెట్ యార్డ్ వైస్‌చైర్మన్ కొండలరావు,సర్పంచ్‌లు దనసాని సత్యవతి, సాంబ, సింహాచలం, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ అప్పారావు, ఎంపీటీసీ నాగలక్ష్మి,నాయకులు చిన్నబ్బి,మురళి,భూషణ్ పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డు సమస్యపై వినతి



ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ సవిరెల చంద్రుడు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి నుంచి గొబ్బిలమడుగు వరకు అసంపూర్తిగా మిగిలిపోయిన ఘాట్ రోడ్ పనులు పూర్తి చేయాలని కోరుతూ గడుఓకుర్తి పంచాయతీ సర్పంచ్ సవిరెల చంద్రుడు సోమవారం రంపచోడవరం ఐటీడీఏ పీఓ సూరజ్ గనోరేకు వినతిపత్రం అందజేశారు. స్పందన కార్యక్రమానికి వెళ్లిన ఆయన పీఓకు రహదారి, రవాణా కష్టాలను పీఓకు వివరించారు. 5 కిలోమీటర్ల నిడివిగల ఈ కాలి బాటను టీడీపీ హయాంలో 600 మీటర్ల మేర ఎటువంటి నిర్మాణం చేపట్టకుండా వదిలిపెట్టేసారని పేర్కొన్నారు. దీనితో రాళ్ళు పైకి తేలి వాహనాల రాకపోకలకు తీవ్ర అడ్డంకి ఏర్పడిందని వివరించారు. తరచు ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయన్నారు. కాగా సమస్యపై స్పందించిన పీఓ ఉపాధి హామీ పథకం ద్వారా వెంటనే రోడ్‌ను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారని సర్పంచ్ చంద్రుడు విలేకరులకు తెలిపారు.

డీసీపీ ఆనందరెడ్డికి మెరిటోరియస్ అవార్డు

ఏఆర్ఎస్ఐ బెండి కాశీపతికి కూడా..



దొండపర్తి: విశాఖ డీసీపీ–2 కె.ఆనందరెడ్డికి ప్రతిష్టాత్మక మెరిటోరియస్ అవార్డు వరించింది. విధి నిర్వహణ ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు అందించే ఈ అవార్డు ఎస్ఐ స్థాయి నుంచి ఎస్పీ స్థాయికి ఎదిగిన ఆనందరెడ్డికి దక్కింది. ఈయనతో పాటు ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న బెండి కాశీపతికి కూడా మెరిటోరియస్ అవార్డు లభించింది.

ప్రైవేటుకు దీటుగా కేజీహెచ్‌లో వైద్య సేవలు



సెంటినరీ ఆర్చ్ ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని. చిత్రంలో ఎంపీ సత్యనారాయణ, ఎమ్మెల్యే గణేష్ కుమార్, కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: కేజీహెచ్‌లో మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి రూ.30 లక్షల వ్యయంతో 15 అదనపు పడకలతో అత్యవసర చికిత్స విభాగం అందుబాటులోకి తీసుకొచ్చామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. కేజీహెచ్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం సాయంత్రం ఆమె ప్రారంభించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రపంచ స్థాయి సదుపాయాలు కల్పించేలా ఆరోగ్య శాఖ 24 గంటలూ పని చేస్తోందన్నారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న తరుణంలో రూ.36 లక్షల ఖర్చుతో గ్రాండ్ సెంటినరీ ఆర్చ్ ప్రారంభించామన్నారు. మొత్తంగా రూ.66 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రారంభించామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆంధ్ర మెడికల్ కాలేజీలో రూ. 600 కోట్లతో 'నాడు – నేడు'లో భాగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. రూ.73 కోట్లతో పీజీ హాస్టల్స్ నిర్మాణం, రూ.79 కోట్లతో వైద్య పరికరాలు సమకూర్చడం, రూ.12 కోట్లతో ఎంఆర్ఐ స్కాన్‌కు సంబంధించి పరికరాలకు ఆర్డర్ ఇచ్చామన్నారు. రూ.4 కోట్లతో సిటీస్కాన్‌ను కొనుగోలు చేస్తామన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా కేజీహెచ్‌లో వైద్య సేవలు అందుతున్నాయన్నారు. నర్సింగ్ కాలేజీ విద్యార్థినులకు రూ.29 లక్షల వ్యయంతో గ్లాస్ ఫార్మా సంస్థ సమకూర్చిన 51 సీటర్ బస్సును మంత్రి ప్రారంభించారు.

రూ.10 కోట్ల సీఎస్సార్ నిధులతో అభివృద్ధి

జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో కేజీహెచ్‌లో గత సంవత్సర కాలంలో రూ.10 కోట్ల సీఎస్ఆర్ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పది అంబులెన్స్‌లు నెల రోజుల్లో రానున్నాయని తెలిపారు. హెచ్‌పీసీఎల్ సహకారంతో రూ.2.5 కోట్ల విలువ చేసే అత్యవసర పరికరాలు సమకూరుస్తున్నామన్నారు. క్యాజువాలిటీ విస్తరించి కౌంటర్లు, వెయిటింగ్ హాల్స్, లాకర్లు ఏర్పాటు చేశామన్నారు. భావనగర్, రాజేంద్రప్రసాద్ వార్డులను ఆధునీకీకరించామన్నారు. 200 పడకలతో మెడ్రస్ చౌల్ట్రీ, రూ.80 లక్షలతో మెడ్రస్ మార్చురీ నిర్మించామన్నారు. ఎమ్మెల్యే ఎ గణేష్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి ఆమడ దూరంలో కేజీహెచ్ ఉండేదన్నారు. కార్యక్రమంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, రిటైర్డు డీఎంఈ డాక్టర్ రవిరాజ్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, వైద్యులు రాధాకృష్ణ, రాజేంద్రప్రసాద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆహార కల్తీకి పాల్పడితే క్రిమినల్ కేసులు

- జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు రవి కుమార్, శ్రీజ వెల్లడి
- దేవరాపల్లిలో దుకాణాల ఆకస్మిక తనిఖీలు



దేవరాపల్లిలో దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న జిల్లా ఆహార, కొలతలు తనిఖీ అధికారుల బృందం

దేవరాపల్లి : తూనికల్లో అక్రమాలకు పాల్పడినా, ఆహార కల్తీకి పాల్పడినా సదరు దుకాణాల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అనకాపల్లి జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు బి.రవి కుమార్, ఎస్.శ్రీజ హెచ్చరించారు. మండల కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం పలు కిరాణా దుకాణాల్లో ఫుడ్‌ఇన్‌స్పెక్టర్లతో పాటు తూనికలు, కొలతలు తనిఖీ అధికారి ఎస్.భాస్కర్, సహాయ అధికారి శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీలు చేశారు. దుకాణాల్లో విక్రయిస్తున్న పప్పు దినుసులు, బాస్మతి రైస్ సాంపిల్స్‌ను సేకరించారు. ఈ సాంపిల్స్‌ను హైదరాబాద్ నాచారంలోని ఆహార తనిఖీ ల్యాబ్‌కు పంపిస్తామని, వాటిలో ప్రజారోగ్యానికి హాని కలిగించేవిగా నిర్ధారణ అయితే ఆయా షాపు యజమానులపై క్రిమినల్ కేసులతో పాటు రూ. 3 లక్షల నుండి రూ. 5 లక్షల వరకు జరిమానా విధిస్తామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ విలేకరులకు తెలిపారు. షాపుల్లో జరుగుతున్న ఆహార కల్తీ, తూనికల్లో అక్రమాలపై తనిఖీ చేసేందుకు అధికారుల బృందం దేవరాపల్లికి వచ్చిందని తెలుసుకున్న చాలా మంది దుకాణాల యజమానులు దుకాణాలు మూసివేశారు. దీంతో తెరిచి ఉన్న కొద్ది షాపుల్లోనే అధికారులు తనిఖీలు చేపట్టారు. వారం రోజుల క్రితం ఆకస్మిక తనిఖీలకు దేవరాపల్లి రాగా ఇదే మాదిరిగా షాపులు మూసేశారన్నారు.

పవర్‌లిఫ్టింగ్‌లో నాగజ్యోతికి బంగారు పతకాలు



72 కేజీల విభాగంలో పవర్‌లిఫ్టింగ్ చేస్తున్న నాగజ్యోతి



బంగారు పతకాలు సాధించిన నాగజ్యోతి

జాతీయ పోటీలకు ఎంపిక

రావికమతం : కొత్తకోట గ్రామానికి చెందిన ఆంగ్ల ఉపాధ్యాయిని పి.వి.ఎం నాగజ్యోతి రాష్ట్ర స్థాయి పవర్‌లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్‌లో బంగారు పతకాలు సాధించింది. ఈ నెల 25 నుంచి 27 వరకూ చత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైంది. ఏపి స్టేట్ పవర్‌లిఫ్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13న విశాఖలో రాష్ట్ర రెండో డెడ్‌లిఫ్ట్ చాంపియన్‌షిప్, 5వ బెంచ్‌ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో నాగజ్యోతి పాల్గొని ఆ రెండు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలను సాధించింది. ఈ నెల 25 నుంచి 27 వరకూ చత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయ పోటీలకు ఆమె ఎంపికైంది. దీంతో ఆమెను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.